## పెన్‌గంగా ఉధృతి.. అయితే మాకేంటి..

వెంకట్రావ్‌పేట్ అంతరాష్ట్ర వంతెనపై నుంచి మహారాష్ట్రకు రేషన్‌బియ్యంను తరలిస్తున్న అక్రమార్కులు

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 4 : ఓ వైపు పెన్‌గంగా ఉధృతితో గ్రామస్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర భయాందోళనతో బ్రిడ్జిపై నుంచి ప్రయాణాలు సాగిస్తుండగా, మరోవైపు పెన్‌గంగా ఉధృతి అయితే మాకేంటి అన్న చందంగా రేషన్ బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రెండు రోజులుగా పెన్‌గంగా ఉధృతితో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోగా, బుధవారం తెల్లవారుజామునా ప్రారంభమయ్యాయి. ఇదే అదునుగా తెల్లవారుజామునే బియ్యం అక్రమార్కులు బైక్‌పై బ్రిడ్జిపై నుంచి రేషన్ బియ్యంను మహారాష్ట్రకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా భారీ ఎండిపోయిన చెట్లు వచ్చి చేరాయి. దీంతో సమీప గ్రామస్తులు ఇలా ప్రమాదకరంగా నదిలో చెట్లపైకి దిగి పెద్ద పెద్ద చెట్లు, కట్టెలను తీసుకుంటున్నారు. ఇటువంటి పనులు చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 4 : ఈనెల 4నుంచి 9వ తేదీ వరకు భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ నుంచి వచ్చిన సూచనల నేపథ్యంలో జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. టిజిఎన్‌పిడిసిఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని, ప్రతీ గంటకోసారి పరిస్థితిని సమీక్షించాలని, అన్ని సర్కిల్ ఆఫీసుల్లో కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయాలు, విపత్కర పరిస్థితులు జరిగిన వెంటనే పరిష్కరించాలని, అవసరమైన సామగ్రి, కాంట్రాక్టర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది సెలువులు అన్నీ రద్దు చేయడం జరిగిందని, అత్యవసర సెలువు కావాలంటే సీఈ స్థాయి అధికారి అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే కార్పోరేట్ ఆఫీసుకు సమాచారం అందించాలని కోరారు.

## పత్తిపంటలో రక్షణ చర్యలు చేపట్టాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 4 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పత్తి రైతులు రక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్ తెలిపారు. అధిక వర్షాలతో మొక్కలోని నీరు నేల పీల్చుకుంటుందని, దీంతో మొక్కలు నేలలోని పోషకాలు పొందక చనిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులను వాడాలని ఆయన రైతులకు సూచించారు.

## ఎస్ఐలను సత్కరించిన విశ్రాంత ఉద్యోగులు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 4: కాగజ్‌నగర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు దీకొండ రమేష్, సుధాకర్‌లను బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, మూర్తి, నర్సయ్య, మహేబూబ్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

మందమర్రి రూరల్, సెప్టెంబరు 4 : రాష్ట్ర వ్యాప్తంగా మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున మండలంలోని ఎంపీడీవో కార్యాలయం పరిధిలో ఏర్పాటు చేసేందుకు బుధవారం డీఆర్డీవో కిషన్, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లలిత కుమారి,ఏపీవో రజియా సుల్తానా,మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి విజయ ఉన్నారు.














